క్లుప్తంగా

ముఖద్వారం కట్టించిన పూర్వ విద్యార్థులు



ప్రవేశ ద్వారం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు ప్రవేశ ద్వారాన్ని కట్టించారు. 2005–06 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు తాము చదువుకొన్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే తలంపుతో పాఠశాల పేరును ముందుకు తీసుకురావాలంటే అందమైన ప్రవేశ ద్వారం నిర్మిస్తే బాగుంటుందని నిర్ణయించారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు రూ. 1.20లక్షలు వెచ్చించి కట్టించారు.

నెలవంక పుస్తకావిష్కరణ


నెలవంక పుస్తకావిష్కరణ గావిస్తున్న ప్రముఖులు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడి, బాల సాహిత్యవేత్త డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 73వ పుస్తకం నెలవంక పుస్తకావిష్కరణ గురువారం నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో ఘనంగా జరిగింది. వాల్మీకి సాంస్కృతిక, సాహితీ సేవా సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, కర్నూలు జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, విశ్రాంత అటవీ శాఖ అధికారి ఏఎల్ కృష్ణారెడ్డి, విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారులు డి. రాజగోపాల్, వెంకటస్వామి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ చేశారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 11, 12 తేదీల్లో కర్నూలు నగరంలో జరగనున్న డీవైఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఉచ్చీరప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ నాయకులు హనుమంతరెడ్డి, గర్జప్ప, మోహన్‌రెడ్డి, చిన్న, హరి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

పెద్దకడబూరు : నిరుద్యోగ సమస్యలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పిలుపునిచ్చారు. డీవైఎఫ్‌ఐ 3వ మండల మహాసభలను మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామ సమీపంలోని నౌలేకల్లు ఎస్ఎస్ ట్యాంక్ ఆవరణలో గురువారం నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు నాగిరెడ్డి, కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు శాంతిరాజు, మైనుల్లా, హుసేన్, వంశీ, గురుమూర్తి, దనుంజయరెడ్డి, సహాయకార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్


మాట్లాడుతున్న మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్

కోసిగి: ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాల కన్నా ప్రథమ స్థానంలో ఉందని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ అన్నారు. గురువారం కోసిగి మండలంలోని తుంబిగనూరు గ్రామంలో చేపల చెరువుల సమీపంలో జాతీయ చేపల రైతు దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 685 ఎకరాలలో 84 మంది రైతులు చేపలు, రొయ్యలు పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 50 వేల హెక్టార్లలో చేపలు, రొయ్యలు పెంపకం చేపతున్నట్లు చెప్పారు. నీళ్ల సంవృద్ధిగా ఉన్న పొలాల రైతులు చేపల పెంపకం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ డివిజన్ పర్యవేక్షకులు నాగరాజు, టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎన్నిక

గోనెగండ్ల: సీఐటీయూ నూతన మండల కమిటీని ఆ సంఘం మండల నాయకుడు వీరన్న గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎండీ ఆనంద్‌బాబు మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా నబి రసూల్, ఉపాధ్యక్షులుగా నీరజ, బతకన్న, వీరన్న గౌడ్, మైమూన్, సహాయ కార్యదర్శులుగా పుష్పవతి, వరలక్ష్మి, వేణుగోపాల్, వెంకటేశ్వరమ్మ, సుశాంతి, సుజాత, రాఘవేంద్ర, కమిటీ సభ్యులుగా మునెప్ప, అనూష, వరలక్ష్మి, హనుమంతు, బంద, రత్నమ్మ, పద్మావతి, యశోదమ్మ మరికొందరిని ఎన్నుకున్నారు.


ప్రసంగిస్తున్న శ్రీసద్గురు అచ్యుతానందస్వాములు


ఎమ్మిగనూరు దత్తసాయి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పూజలు


కోసిగిలో షిరిడీ సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు


విక్టోరియాపేటలో పాండురంగస్వామి రథోత్సవం

అజ్ఞానాన్ని తొలగించేవాడే గురువు

ఆదోని అర్బన్: శిష్యుడి అజ్ఞానం, అంధకారాన్ని తొలగించేవాడే గురువు అని సద్గురు అచ్యుతానందస్వాములు అన్నారు. గురువారం ఆదోని మండలం సాదాపురం గ్రామంలో వెలిసిన శ్రీ అచ్యుతానంద ఆశ్రమంలో గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ మహోత్సవాలు జరిగాయి. అచ్యుతానందస్వాముల ఆధ్వర్యంలో వేకువజాము నుంచి మహాగణపతి పూజ, గురు భగవాన్ శ్రీ వ్యాసమహర్షి పూజ, నవగ్రహశాంతి పూజ, అఖండ గీత హోమం, గ్రామంలో వ్యాసమహర్షి పటంతో ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. అనంతరం శ్రీ అచ్యుతానందస్వామి వారు భక్తులకు ఆధ్యాత్మిక విషయాలను, గురువు గురించి ప్రసంగించారు.

ఆలయాల్లో పూజలు

పట్టణంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆయా దేవాలయాల్లో గురువారం పూజలు జరిగాయి. పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లకొండ పాండురంగస్వామి ఆలయంలో రుక్మిణి పాండురంగస్వామివార్లకు పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని టీజీఎల్ కాలనీలో వెలిసిన సాయిబాబా ఆలయంలో శ్రీ షిరిడీ సాయిసేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబాకు పాలాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ రుక్మిణి పాండురంగస్వామి విగ్రహాలను గురువారం సాయంత్రం పురవీధులగుండా డోలు, సన్నాయిల మధ్య రథోత్సవం నిర్వహించారు.

- పెద్దకడబూరు : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిసేవక్ రవీంద్రనాథ్‌రెడ్డి వారిచే పూజ్య గురుదేవులు శ్రీ అమ్ముల సాంబశివరావు రచించిన సాయిబాబా వారి జీవిత చరిత్ర నుంచి 14వ అధ్యాయాన్ని, భజన పాటాలు, సత్సంగం భక్తులకు వినిపించారు.
- కోసిగి: మండల కేంద్రంలోని ఉరకుంద క్రాస్ రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో వేకువ జామున నుంచి సాయి ఋత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ నేతృత్వంలో సాయిబాబా వారికి కాకడ హారతి, సుప్రభాత సేవ, ఉచిత సాయి సామూహిత సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్రము పఠనం, నిత్య ప్రార్థన పఠనం గావించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక దత్తసాయి ఆలయంతో పాటు శిల్పాఎస్టేట్ సమీపంలోని సాయి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం పల్లకీ సేవ, సంధ్యాహారతి, సేజ్ హారతి చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి దత్తసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూజలో పాల్గొన్నారు.


పెద్దకడబూరులో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

- గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో ఈశ్వరదేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం నుంచి తుంగభద్ర దిగువ కాలువ దగ్గర ఉన్న శివాలయం వరకు సాయిబాబా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు.
- కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు, ఏరిగేరి, కామవరం గ్రామాలతో పాటు రాజానగర్ క్యాంపులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆలయాలలో సాయి ప్రవచనాలతో భజనలు చేపట్టి సాయినామస్మరణాన్ని చేపట్టారు. వచ్చిన భక్తులకు ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.


గోనెగండ్లలో సాయి పల్లకీని ఊరేగిస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి


ఆదోనిలో రుక్మిణి పాండురంగస్వామి వార్లకు మంగళహారతి ఇస్తున్న పూజారి


శ్రీమఠంలో భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

వైభవంగా వెండి రథోత్సవం

మంత్రాలయం రూరల్ : శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో హారతులు పట్టి వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య వెండి రథంపై ప్రహ్లాదరాయలును ఊరేగించారు. అలాగే రాఘవేంద్ర స్వామిని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై. సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు.

పీఠాధిపతికి తులాభారం

గురుపౌర్ణమి సందర్భంగా బెంగళూరుకు చెందిన భక్తులు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులకు తులాభారం నిర్వహించారు. బెల్లం, బేడలు, ఆహార ధాన్యాలతో తులాభారం చేశారు. అందరూ క్షేమంగా ఉండాలని పీఠాధిపతి ఆశీర్వదించారు.


శ్రీమఠంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి


శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులుకు తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కులుమాల గ్రామంలో ఎంపీడీఓ మణి మంజరి, ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలేవరూ చెత్తను బయట పారవేయకూండా తడి, పొడి చెత్తలను వేరువేసి డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మీ ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు అందివ్వాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద తయారి కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తతో వర్మికంపోస్టు ఎరువులను తయారు చేసి అమ్మకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామదాస్, సిబ్బంది పాల్గొన్నారు.


కులుమాలలో చెత్తను సేకరిస్తూ అవగాహన కల్పిస్తున్న డీఎస్‌డీఓ, అధికారులు

ఆస్తి విషయంలో దాయాదులపై దాడి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో దాయాదులైన లక్ష్మన్న, రంగారెడ్డిలకు కొంతకాలంగా 70 సెంట్ల ఆస్తి విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. ఇదే విషయంలో గురువారం పొలం దగ్గరకు వెళ్లిన లక్ష్మన్న, కేసీ నాగన్నలపై దాయాదులు రంగారెడ్డి, శాంతికుమార్, రమేష్‌తో పాటు మరి కొందరు కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. దాడిలో లక్ష్మన్న, లక్ష్మన్న భార్య చెన్నమ్మ, కెసి. నాగన్న, కెసి. ఆకాష్, కెసి. అభిషేక్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఇంటి గోడ విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో ఇంటి పక్కన గోడ కట్టే విషయంలో గురువారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన నల్లన్న, పెద్దయ్యల ఇంటి మధ్యలో గోడ కట్టే విషయంలో మాటామాటా పెరటంతో రెండు కుటుంబాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో పెద్దయ్య, చిన్నన్న, నబిల్‌కు గాయాలు అయ్యాయి. గాయపడ్డ ఇరు కుటుంబాల వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

డీసీకి అమూల్య రత్న పురస్కారం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు సంత్ మహరాజు బాబా అమూల్య రత్న పురస్కారాన్ని అందజేశారు. బుడుములదొడ్డి ఆంజినేయ స్వామి ఆలయంలో ఉండే బాబా గురువారం డీసీకి అవార్డును ప్రదానం చేశారు. బాబా మాట్లాడుతూ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో గత మూడు దశాబ్దాల కాలం నుంచి జరగని అభివృద్ధిని డిప్యూటీ కమిషనర్ విజయరాజు చేశారని కొనియాడారు.


అమూల్య రత్న పురస్కారం అందజేస్తున్న బాబా

పేరెంట్స్ మీటింగ్స్ అంతా ఆర్భాటాలే


ఎమ్మెల్యే కోసం నిరీక్షిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు


పురపాలక చైర్ పర్సన్ లోకేశ్వరికి స్వాగతం పలుకుతున్న పురపాలక ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ,పురపాలక, ఎయిడెడ్, ఇంటర్మీడియట్ పాఠశాలలు, కళాశాలల్లో గురువారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌లు అంతా హంగులు, ఆర్భాటాలతోనే నడిచాయి. ఎక్కడ కూడా విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపయోగపడే అంశాలు కాని, పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వంటివి చర్చించలేదు. మెగా పేరెంట్స్ మీటింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అందులో ముఖ్యంగా ప్రతి తల్లిదండ్రులతో పిల్లల పురోగతి, ఆరోగ్య అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్య అతిథి విద్యార్థులు వేసే పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అయితే తల్లికి వందనం పేరుతో విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి వారి పిల్లల చేత పాదాభివందనం, నృత్య ప్రదర్శనలు, తాడాట వంటివి, నిర్వహించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కార్యక్రమాలను నిర్వహించి మీటింగ్‌లకు ముగింపు పలికారు.

ఎమ్మెల్యే రాక కోసం నిరీక్షణ

పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే డా. పార్థసారథి రాక కోసం నిరీక్షించారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలకడానికి ఎన్‌సీసీ విద్యార్థులను ఉదయం 10.30 గంటల నుంచి ఎండలో నిలబెట్టారు. 11 గంటలకు రావాల్సిన ఎమ్మెల్యే 11.42 నిమిషాలకు వచ్చారు. దీంతో విద్యార్థులు నీరసించి పోయారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ముగించాల్సిన కార్యక్రమం 1.30 గంటలకు ముగిసింది. కార్యక్రమాల్లో మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు, డిప్యూటి డిఎంఅండ్ హెచ్‌ఓ సత్యవతి దేవి పాల్గొన్నారు. అలాగే ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన ఇంటర్మీడియెట్ విద్యార్థుల తల్లిదండ్రులు అధ్యాపకుల ఆత్మీయ సమావేశం జరిగింది.

పెద్దకడబూరు : విద్యార్థుల జీవితాలలో నేటి చదువులే రేపటి మీ భవిష్‌తు పునాదులని ఎంపీపీ శ్రీవిద్య, ఎంఈఓ నాగరాజురావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- నేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- భారీగా తరలిరావాలని పిలుపు

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుద్దామని ఆదోని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం పట్టణంలోని రోషన్‌గార్డెన్‌లో జరిగే ఆదోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువకులు, మహిళలు, మహిళా నాయకురాళ్లు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదోనిలో జరిగే విస్తృతస్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం జిల్లాలోనే నంబర్‌వన్ కావాలని ఆయన ఆకాంక్షించారు. జగన్ అంటే ఆదోని, ఆదోని అంటే జగన్ అనే విధంగా ఉండాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో పార్టీ శ్రేణులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి

మునుపెన్నడూ జరగనివిధంగా ఆదోనిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదల దరి చేరాయని మాజీ ఎమ్మెల్యే సాయి అన్నారు. ఆంధ్ర ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బైపాస్ రోడ్డు, మెడికల్ కళాశాల, 5 వేల టిడ్కో ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు పేదల దరి చేరాయన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ పాలనలో అంతంత మాత్రంగానే పనులు జరిగాయన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పట్టణంలోని 42 వార్డులు, 42 గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. 42 మంది కౌన్సిలర్లు, ఒక్కొక్క కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, వివిధ శ్రేణి నాయకులు తమ అనుచరులతో భారీగా తరలిరావాలని కోరారు.

కూటమి పాలనలో అరాచకాలు

కూటమి పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. 13 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందన్నారు. ఆదోని అభివృద్ధికి నిధులను మంజూరు చేయించడం, అభివృద్ధి పనులు చేపట్టడంలో కూటమి ఎమ్మెల్యే పార్థసారథి విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నారే తప్పా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, పట్టణాధ్యక్షులు దేవా, ప్రచార కార్యదర్శి నారాయణ, మురళీరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు యేసేబు, కౌన్సిలర్లు మల్లికార్జున, వసీం, వికలాంగుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు తిమ్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ


దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనికి చెందిన దివ్యాంగుడు రంగన్నకు బుధవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఆదోని నియోజకవర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హనుమంతరెడ్డి, మరికొంత మంది దివ్యాంగులు అతని పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ట్రైసైకిల్ కొనుగోలుకు తనవంతు సహాయ సహకారాలను అందించారు. ఏదేని సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి చెప్పారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి

నందవరం : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, వేరుశనగ పంటలకు పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా పరిహారం పొందేందుకు రైతు స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులో పంటల రుణాలు పొందిన రైతులకు బ్యాంకులే పంటల బీమా నమోదు చేస్తాయన్నారు. రుణాలు పొందని రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సునీల్‌కుమార్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అర్బన్: డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ఐఎంఏ ఆదోని బ్రాంచి ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌లు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శ్రీనివాస్‌లు విన్నవించారు. గురువారం పట్టణంలోని ఆదిత్య నర్సింగ్ హోంలో జరిగిన సమావేశానికి ఆదోని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఎంఏ ఆదోని బ్రాంచి ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతిసారి రిజిస్ట్రేషన్‌ల కోసం, రెన్యూవల్స్ కోసం కర్నూలుకు వెళ్లి రావాల్సి వస్తుందన్నారు. ఇక్కడే డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో దరఖాస్తులను సబ్మిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్, ట్రెజరర్ డాక్టర్ ఆదిత్యకుమార్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరీష్, సీనియర్, జూనియర్ వైద్యులు, మహిళా వైద్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఎమ్మిగనూరు పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా బోయరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా లతారెడ్డి, రైతు విభాగానికి శ్రీధర్‌రెడ్డి, బీసీ సెల్‌కు కురువ ఎంకన్న, ఎస్సీ సెల్ విభాగానికి మండ్రి శివ, ఎస్టీ సెల్ వై.క్రిష్ణ, ముస్లిం మైనారిటీ సెల్ ముల్లా రసూల్, క్రిస్టియన్ మైనారిటీ మండ్రి ప్రభాకర్, విద్యార్థి విభాగం పింజరి హుసేన్, మున్సిపల్ విభాగం ఆర్.రంజానమ్మ, ఆర్‌టీఐ విభాగం చంద్రమోహన్‌రెడ్డి, వలంటీర్ విభాగానికి అధ్యక్షుడిగా గొల్లవీరేష్ నియమితులయ్యారు. గ్రీవెన్స్ సెల్ విభాగానికి ఎండీ.నరసింహులు, వాణిజ్య విభాగం కనికె నాగేంద్ర, వీవర్స్ విభాగం ఎస్‌బి.దత్తాత్రేయ, లీగల్ సెల్ ఎంకే గురురాజారావు, కల్చరల్ విభాగం దూపం మద్దిలేటి, డాక్టర్స్ విభాగం కటికె యుసుఫ్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులును నియమించారు. అలాగే సోషల్ మీడియా విభాగానికి నాయక్ ఎండీ షరీఫ్, ఐటీ వింగ్‌కు రాయచూర్ షాషావలి, దివ్యాంగుల విభాగానికి బోయ రాఘవేంద్ర, ఇంటలెక్చువల్ ఫోరం బారికి చిన్న పంపయ్య, బూత్ కమిటీ ఈడిగ శ్రీరాములు గౌడ్, పబ్లిక్ వింగ్ విభాగ అధ్యక్షుడిగా పైయింటి రఘునాథ్‌లను నియమించారు.

మున్సిపల్ బీసీ విభాగం కమిటీ

వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు మున్సిపల్ బీసీ విభాగ కమిటీకి అధ్యక్షుడిగా బోయబజారి, ఉపాధ్యక్షులుగా కెజి.నాగరాజు, బోయమణి, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పర గిరి,కప్పట్రాళ్ల సలీం, బోయ శ్రీనివాసులు, కార్యదర్శులుగా మాచాని రఘు, వడ్డే గుండ రాజు, కనికె శివ, యు.విజయ్ కుమార్, టి.మహేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ మహబుబ్‌బాషా, కురువ మంజునాథ్, చాకలి ఈరన్న, బి.ఉలిగప్ప, గద్దం శివ, టికె.గౌస్, టి.వేణులను నియమించారు.

మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్‌కు పరామర్శ

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ నాయకుడు గంజిహళ్లి తిరుమల రెడ్డిని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి పరామర్శించారు. తిరుమల రెడ్డి గతకొంత కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న యువ నాయకుడు రాజీవ్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి గురువారం గంజిహళ్లి గ్రామానికి చేరుకొని తిరుమల రెడ్డిని పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం గంజిహళ్లి బడేసాహెబ్ తాతా దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్ రెడ్డి, మణిక్య రెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం అమరావతిలో ఇంటర్మీడియెట్ విద్యామండలి డిప్యూటీ కార్యదర్శి ఇందిరాను కలసి వినతి పత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్ కోర్సుల ద్వారా నీట్, జెఈఈ, మెయిన్స్, జిప్‌మర్ పుస్తకాల పేర్లతో వ్యాపారం చేస్తున్నారని తెలిపారు.